క్లుప్తంగా

రేపు మల్లయ్యకొండపై వేలం

తంబళ్లపల్లె: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా తలనీలాల సేకరణ, వాహన పార్కింగ్ తదితరాలపై శుక్రవారం మల్లయ్యకొండపై ఉదయం 12 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ, కొండకిట్ట తెలిపారు. తలనీలాల సేకరణకు పాటదారులు రూ.లక్ష దరవాత్తు, వాహన పార్కింగ్‌కు రూ.లక్ష,గొరమ్మగుడి వద్ద పూజానిర్వహణ రూ.50 వేలు, ఏనుగుమల్లమ్మగుడి వద్ద పూజా నిర్వహణ రూ.50 వేలు, వీరన్నగుహ వద్ద పూజా నిర్వహణకు రూ.10 వేలు, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.50వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు.

ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

మదనపల్లె సిటీ: పట్టణ సమీపంలోని వన్నూర్‌సాహెబ్‌గుట్టలో వెలసిన బాబా ఎసానుల్లాఖాన్‌వార్సీ దర్గా ఉరుసు ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గంధం, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఉరుసు పురస్కరించుకుని దర్గాను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తులు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ వితరణ

మదనపల్లె సిటీ: మదనపల్లె సమీపంలోని సర్కారుతోపునకు చెందిన దివ్యాంగుడు కదిరప్పకు బుధవారం హెల్పింగ్‌మైండ్స్ సంస్థ నిర్వాహకులు ట్రై సైకిల్ వితరణగా అందజేశారు. దివ్యాంగుడు కదిరప్ప నడలేని స్థితిలో ఉన్నాడు. ఎక్కడైనా వెళ్లాలంటే కష్టంగా ఉండేది. విషయం తెలుసుకుని హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు దాతలు గాజుల రమేష్‌కు తెలియజేశారు. తనవంతుగా ట్రైసైకిల్ కొనుగోలుకు డబ్బు అందజేశారు. కదిరప్పకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు కిరణ్, హర్ష, చైతు, సాంబ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

బి.కొత్తకోట: మండల తహసీల్దార్‌గా మొహమ్మద్ అజారుద్దీన్ బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన డిప్యూటీ తహసీల్దార్ మొహమ్మద్ అన్సారీ నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఆయనకు మండలానికి చెందిన ఆర్ఐ, సర్వేయర్, వీఆర్ఓలు, సిబ్బంది సత్కరించారు.

పింఛన్లు తనిఖీ

పెద్దమండ్యం: మండలంలోని పెద్దమండ్యం, పాపేపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో రూ.15 వేల పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులను బుధవారం డాక్టర్‌లు తనిఖీ చేశారు. పెద్దమండ్యం గ్రామ సచివాలయం పరిధిలో 24 మంది పింఛను పొందుతుండగా, పాపేపల్లె గ్రామ సచివాలయం పరిధిలో ఐదుగురు పింఛను పొందుతున్నారు. ప్రభుత్వం నిబంధనల మేరకు లబ్ధిదారుల వికలత్వంపై డాక్టర్‌లు ప్రతి ఒక్కరినీ పరీక్షించారు. అలాగే వికలత్వ సర్టిఫికెట్స్‌ను పరిశీలించి, ఏ ప్రాంతంలో వాటిని పొందారనే విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో కడప రిమ్స్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫసర్లు జ్యోత్స్న, సి భాస్కరరావు, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, పిహెచ్‌సీ డాక్టర్ ఇమ్మాన్యుల్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి భూముల రీసర్వే

పీలేరు : మండలంలో మూడో విడత భూముల రీసర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భీమేశ్వర్‌రావు తెలిపారు. గురువారం మండలంలోని వేపులబైలు పంచాయతీలో భూసమస్యల పరిష్కారం కోసం రీసర్వే నిర్వహిస్తున్నట్లు రైతులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు స్థలం మంజూరు చేయండి

ములకలచెరువు: మండలంలోని కాలువపల్లెలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల కోసం స్థలం మంజూరు చేసి ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం సహకరించాలని స్థానిక ప్రజలు బుధవారం తహసీల్దార్ ప్రదీప్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాలువపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో 145 మంది విద్యార్థిని, విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉన్నత పాఠశాల కోసం ఏడు కిలోమీటర్ల దూరం ఉన్న చౌడసముద్రంకు వెళ్లాల్సి ఉంది. ఇందులో ఎక్కువగా ఆడపిల్లలు ఉన్నారు... బస్సు సౌకర్యం కూడా లేదు. ఉన్నతాధికారులు ఇప్పుడున్న పాఠశాలను రెండుగా చేస్తున్నారు. ప్రైమరీ పాఠశాల, ఉన్నత పాఠశాలలుగా విభజించి ఏర్పాటు చేయనున్నారు. దీనికి స్థలం తక్కువగా ఉన్నందున ఉన్నత పాఠశాల నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరారు. సర్పంచు మహబూబ్‌బాషా, స్థానికులు మౌలాలి, ఖాదర్ వలి, గులాబ్‌జాన్, తదితరులు ఉన్నారు.

కమనీయం.. కల్యాణం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం స్వాతి నక్షత్రంతో పాటు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించాలి

మదనపల్లె సిటీ: విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించాలని ఎంఈఓ రాజగోపాల్ అన్నారు. బుధవారం స్థానిక బెంగళూరురోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్,గైడ్స్ క్లబ్‌మాస్టర్స్, ఫ్లాక్ లీడర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను ప్రారంభించాలన్నారు.

ఇటు ఊళ్లు..అటు పొలాలు

- మధ్యలో పుంగనూరు ఉపకాలువతో రాకపోకలు
- ఇబ్బందుల్లో రైతులు, ప్రజలు
- పీబీసీపై 18 చోట్ల బ్రిడ్జిలను నిర్మించాలి
- లైనింగ్ పనుల్లో భాగంగా చేపట్టాలని డిమాండ్



బి.కొత్తకోట మండలం గుండ్లపల్లి వద్ద కాలువ నీటిలో శవాన్ని మోసుకొని దాటుతున్న గ్రామస్తులు (ఫైల్)

బి.కొత్తకోట: హంద్రీ-నీవా సాగునీటి ప్రాజెక్టుకు చెందిన పుంగనూరు ఉపకాలువ కారణంగా రైతాంగం, ప్రజలు ఎదుర్కొంటున్న కష్టనష్టాలు అన్నీఇన్నీ కావు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబలకోట మండలాల మీదుగా సాగే ఈ కాలువకు ఇటు వైపు ఊళ్లు ఉంటే..అటువైపు పొలాలు, గ్రామాల ప్రజలకు నిత్యం అవసరమయ్యే పనులకు సంబంధించి రాకపోకలు సాగించే ప్రాంతాలు ఉన్నాయి. వీటికి మధ్యలో కాలువ సాగుతున్నందున రైతాంగం పొలం పనులకు, ప్రజలు తమ అవసరాల కోసం ఇతరా ప్రాంతాలకు వెళ్లాలంటే నరకం చూస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు చేపట్టి ఊళ్లున్న చోట కాలువపై బ్రిడ్జిలను నిర్మించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

నీళ్లొస్తే అంతే సంగతి

పీబీసీలో నీళ్లు వదిలితే ఎక్కడి ప్రజలు, రైతులు అక్కడే ఉండిపోవాలి. పెద్దతిప్పసముద్రం మండలంలోని గడ్డంవారిపల్లె నుంచి మొదలయ్యే కాలువ మదనపల్లె-కురబలకోట మండలాల సరిహద్దు వరకు సాగుతుంది. ఈ కాలువ పొడవునా గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామస్తులకు చెందిన పొలాలు ఊళ్లకు చుట్టూ ఉంటాయి. కాలువ నిర్మాణం ఊళ్ల పక్కనుంచే జరగడంతో ప్రస్తుతం వీరు పొలం పనులకు వెళ్లాలన్నా, సేద్యం చేయాలన్నా కిలోమీటర్ల దూరం ప్రయాణించి పొలాలకు వెళ్లాలి. వ్యవసాయ పనిముట్లు, సేద్యానికి అవసరమైన వాటిని తరలించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నీళ్లు లేనప్పుడు కాలువలోకి దిగి అటువైపుకు వెళ్తుంటారు. నీళ్లుంటే ఇక ఎన్నో ఇబ్బందులు. ఉదాహరణకు బి.కొత్తకోట సమీపంలోని జనుపవారిపల్లికి చెందిన గ్రామస్తుల పొలాలు, గ్రామస్తులు పూజించే ఆలయం అన్నీ కాలువకు అటువైపు ఉన్నాయి. ఇక్కడికి వెళ్లాలంటే వీలుకాదు. దీనితో పీటీఎం మండలంవైపుకు వెళ్లి పనులకు వెళ్లాల్సి వస్తోంది. ఆలయంలో నిత్యం పూజలు చేయలేని పరిస్థితి నెలకొంది.

10 కి.మీ వెళ్లాలి

బి.కొత్తకోట మండలంలోని గుండ్లపల్లి గ్రామస్తుల కష్టాలు వర్ణనాతీతం. గ్రామం దక్షిణాన ఉంటే పొలాలన్నీ ఉత్తరం వైపు ఉంటాయి. కాలువ సరిగ్గా ఊరి పక్కనే నుంచి సాగడంతో పడరాని పాట్లు పడుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లాలన్నా, పంట ఉత్పత్తులను తరలించుకోవాలన్నా 10 కిలోమీటర్లు చుట్టూ వెళ్లాలి. తరిగోడు మీదుగా గట్టు, దిన్నిమీదపల్లి, శీతివారిపల్లె నుంచి గుండ్లపల్లికి రాకపోకలు సాగించాలి. ఇలాంటి పరిస్థితులే మూడు మండలాల్లో 18 చోట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పీబీసీకి లైనింగ్ పనులు చేయించేందుకు సిద్ధం కావడంతో పనులు ప్రారంభమయ్యాక ఊళ్ల వద్ద సింగిల్ లైన్ బ్రిడ్జిలను నిర్మించి సౌకర్యం కల్పిస్తే సమస్యలు తీరుతాయి.

బ్రిడ్జిల నిర్మాణమే పరిష్కారం



పీబీసీపై 18 చోట్ల సింగిల్ లైన్ బ్రిడ్జిలను నిర్మించడమే గ్రామాల సమస్యకు పరిష్కారం. ఈ సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గుర్తించి పనులు చేపట్టేలా ప్రతిపాదించాం. అప్పట్లో కాలువ వెడల్పు పనులు ఉన్నందును ఆ పనుల్లోనే పూర్తి చేయించేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పుడు లైనింగ్ పని చేయిస్తుండటంతో ప్రాజెక్టు అధికారులు దీనిపై దృష్టి పెట్టి గ్రామాల ప్రజలు శాశ్వత పరిష్కారంగా బ్రిడ్జిలను నిర్మించి సౌకర్యం కలిగించాలి.

-పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

ఆస్పత్రి విషయంలో ఎమ్మెల్యే హామీ నిలుపుకోవాలి

- నెలరోజుల్లో పరిష్కారం కాకపోతే ప్రజాఉద్యమం
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్
- సీపీఎం సామూహిక దీక్షలకు అఖిలపక్షాలు, ప్రజాసంఘాల మద్దతు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : జిల్లా ఆస్పత్రిని అభివృద్ధి చేసి, నెలరోజుల్లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి ప్రైవేటీకరణ జరగకుండా అడ్డుకునే బాధ్యత నాదేనన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హామీని నిలుపుకునే దిశగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకుందాం పేరుతో సీపీఎం చేపట్టిన సామూహిక దీక్షలు బుధవారానికి రెండోరోజుకు చేరుకున్నాయి. దీక్షలకు వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, వీసీకే, సీఐటీయూ, ఐటీయూసీ, ఉపాధ్యాయసంఘం, అంగన్‌వాడీ యూనియన్, దళితసంఘర్షణసమితి, అఖిలభారత ప్రజాతంత్ర మహిళాసంఘం(ఐద్వా), వాల్మీకిసంఘం, మున్సిపల్ వర్కర్స్, ఆటోయూనియన్ తదితర సంఘాలు మద్దతు తెలుపుతూ దీక్షలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ...మదనపల్లె అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా కలిసి పనిచేసేందుకు తాము సిద్ధమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మదనపల్లెకు 495 కోట్లతో మెడికల్ కాలేజీని మంజూరుచేయడంతో పాటు 70శాతానికి పైగా పనులు పూర్తిచేశామన్నారు. పట్టణంలోని జిల్లా ఆస్పత్రిని మెడికల్ కాలేజీకి అనుబంధంగా సర్వజన బోధనాసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి, కావాల్సిన అదనపు భవనాలు, ఏర్పాట్లు చేశామన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచే మెడికల్ కాలేజీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్న క్రమంలో కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. రాజకీయ దురుద్దేశంతో మెడికల్ కాలేజీ పనులు నిలుపుదల చేసిందన్నారు. వైద్యవిద్యను అభ్యసించాలనుకున్న విద్యార్థులకు 150 మెడికల్ సీట్లు రావడంతో పాటుగా, పట్టణం అభివృద్ధి చెందేదన్నారు. మదనపల్లె అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంచిచేస్తే, కూటమిప్రభుత్వం రాజకీయకక్షతో అడ్డుకుని, ప్రైవేటీకరణకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. జిల్లా ఆస్పత్రిని ప్రైవేటీకరణ జరగకుండా సీపీఎం చేస్తున్న పోరాటానికి వైఎస్సార్ సీపీ తరపున సంఘీభావం తెలుపుతున్నామన్నారు. అంతకుముందు దీక్షా శిబిరానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వెళ్లి..మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని సర్వజన బోధనాసుపత్రి నుంచి తొలగించి మెడికల్ కమిషనర్ పరిధిలోకి తేవడం జరిగిందన్నారు. నెలరోజుల్లోపు పూర్తిస్థాయి డాక్టర్లు, నర్సులు, సిబ్బందిని నియమించి మదనపల్లె ఆస్పత్రిని కాపాడే బాధ్యత నాదేనని హామీ ఇచ్చారు. ఆరోగ్యమంత్రి సత్యకుమార్‌ను మదనపల్లెకు తీసుకువచ్చి, ఆస్పత్రిలో సమావేశం పెట్టి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కాంగ్రెస్‌నాయకులు రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ..ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే బీజేపీతో దోస్తీ చేస్తున్న తెలుగుదేశంలో అదే దారిలో ప్రయాణిస్తుండటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, నాగరాజు, ప్రభాకర్ రెడ్డి, కృష్ణమూర్తి, నరసింహులు, వైఎస్సార్ సీపీ నాయకులు మునిశేఖర్, ఆంజనేయులు, కొత్తపల్లె మహేష్, చరణ్, చిప్పిలిమల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించకుంటే కేసులు

కలకడ : రహదారి నియమాలు పాటించకున్నా, ద్విచక్రవాహణదారులు హెల్మెంట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించకున్నా కేసులు తప్పవని ఎస్ఐ రామాంజనేయులు హెచ్చరించారు. బుధవారం చిత్తూరు-కర్నూలు జాతీయరహదారిపై కలకడ ఇందిరమ్మ కాలనీ సమీపంలో వాహనాలు ఆపి వాహనాల, వాహన చోదకుల రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారికి, హెల్మెంట్, సీటు బెల్టు ధరించని వారికి అపరాధరుసుము విధించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెట పోలీసులు ఉన్నారు.

గొల్లపల్లిలో కనుమ వేడుకలు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం పెంచుపాడు పంచాయతీ గొల్లపల్లిలో బుధవారం కనుమ వేడుకకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడకల్లో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ పాల్గొన్నారు. గ్రామస్థులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామస్థులకు ఏవైనా సమస్యలు వస్తే అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన పీడీ రమాదేవి

పీలేరురూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు పీడీ పి. రమాదేవి అన్నారు. బుధవారం పీలేరు పట్టణంలోని యల్లమంద క్రాస్, ఆర్టీసీ నల్లగుట్ట, కావలిపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 2275 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, 1.05 లక్షల మంది పిల్లలు ఉన్నారని తెలిపారు. 1030 పక్కా భవనాలు ఉన్నాయని, 775 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నట్లు చెప్పారు. నాడు నేడు కింద 141 అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో 143 పోస్టులు ఖాళీగా 116 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. మిగిలినవి కోర్టు కేసులతో పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీవో రాజమ్మ, సూపర్‌వైజర్ అక్కయమ్మ పాల్గొన్నారు.

పశువులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

కేవీపల్లె : పశువులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఏపీ పశు సంవర్ధక శాఖ అడిషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటరావు అన్నారు. బుధవారం మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ జాండ్రపేట, బసిరెడ్డిగారిపల్లెలో నిర్వహించిన పశువైద్యశిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పశువులు, గొర్రెలకు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమైనప్పుడు సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలని ఆదేశించారు. పాడిరైతులకు పశుపోషణపై అవగాహన కల్పించాలన్నారు. శిబిరంలో 142 ఆవులకు, 36 దూడలకు, 790 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. 14 ఆవులకు గర్భకోశ సమస్యకు వైద్యం చేపట్టారు. 158 పశువులకు పిడుదుల నివారణకు మందు పిచికారి చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె. గుణశేఖర్‌పిళ్లై, రాయచోటి ఉప సంచాలకులు డా డి. మాలకొండయ్య, పీలేరు సహాయ సంచాలకులు డాక్టర్ కె. రవికుమార్, పశు వైద్య అధికారి డాక్టర్ మునిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

తంబళ్లపల్లె: పశువుల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్తలు పాటించినప్పుడే పశువులు అనారోగ్యం బారిన కాకుండా ఉంటాయని పశుసంవర్ధకశాఖ ఏడీ సుమిత్ర తెలిపారు. బుధవారం తంబళ్లపల్లె మండలంలో గుండ్లపల్లె,గంగిరెడ్డిపల్లె, పెద్దమండ్యం మండలంలో ఎర్రగుట్టపల్లె, చెరువుకిందపల్లెల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. సుమారు 146 పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. ఆవులు, దూడలు,గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ విక్రమ్‌రెడ్డి, ఎంవీసీపీ డాక్టర్ ఇందు, జెవీఓలు పాల్గొన్నారు.

మాంసపు దుకాణాలపై చర్యలు తీసుకొంటాం

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో మాంసపు దుకాణాలపై చర్యలు తీసుకొంటామని ఎంపీడీఓ వెంకటేశులు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలోఆయన మాట్లాడుతూ గత మంగళవారం గుర్రంకొండలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు పలుదుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా కాలంచెల్లిన వస్తువులను సీజ్ చేసి కేసులు నమోదు చేశారన్నారు. కల్తీ మాంసం విక్రయించే దుకాణాలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో మాంసపు దుకాణాలను తనిఖీ చేసి చర్యలు తీసుకొనేందకు ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రావాల్సి ఉందన్నారు. పంచాయతీ ఈవో, తాను కలసి మాంసపు దుకాణాలపై విచారణ జరిపిస్తామన్నారు. కాలువలపైన, అపరిశుభ్రంగా ఉన్న స్థలాల్లో, దుమ్ముధూళి ఉన్న ప్రాంతాల్లో మాంసం విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు.

బయటపడిన మరో పురాతన రాత్రి విగ్రహం



పొలంలో బయటపడిన పురాతన రాతి విగ్రహం

తంబళ్లపల్లె: మండలంలోని కోటకొండ మద్దిరాళ్లపల్లె సమీపంలో రంగారావు పొలంలో కౌలు రైతు వెంకటేష్ ట్రాక్టర్‌తో దుక్కి దున్నగా గత సోమవారం రెండు పురాతన రాతి విగ్రహాలు బయటపడిన విషయం తెలిసిందే. అదే పొలంలో మరో మూడు అడుగుల పురాతన రాతి విగ్రహం బయటపడింది. ఇది విష్ణుమూర్తి విగ్రహం అయి ఉండవచ్చునని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ హరికుమార్, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. ఇలాంటి విగ్రహాలు బయటపడితే వెంటనే సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ ప్రజలకు సూచించారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డు నాటించిన రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ: మండలంలోని ఖండ్రిగ గ్రామంలో ఎట్టకేలకు ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. గ్రామ పరిధిలోని 503-8లో వంక పోరంబోకు స్థలాన్ని కొంతమంది ఆక్రమించకొని చదును చేసుకొన్నారు. మురాద్‌బీ కుంటకు వర్షపునీరు చేరే ఈ వంకను ఆనవాళ్లు లేకుండా చేసి కొంతమంది ఆక్రమించేశారు. జేసీబీలతో వంకను ధ్వంసం చేసి ప్లాట్లు విక్రయించడానికి సిద్ధం చేసుకొన్నారు. దీంతో గ్రామస్తులు తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వోలు సదాశివ, అమీర్, సర్వేయర్ వినోద్‌లు వంకస్థలాన్ని సర్వే చేశారు. మొత్తం 25 సెంట్ల మేరకు ఆక్రమణకు గురైనట్లు విచారణలో తేల్చారు. ఈనేపథ్యంలో బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో అమీర్, సర్వేయర్ వినోద్, నందినీ, మురళీలు మురాద్‌బీ వంక వద్దకు చేరుకొని ఆక్రమణ గురైన ప్రభుత్వంలో హెచ్చరిక బోర్డు నాటించారు. ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదని ఇక్కడ ఎవరైనా ప్రవేశిస్తే చట్టపరంగా చర్యలు తీసుకొంటాని తహసీల్దార్ హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కలికిరి: మండలంలోని కలికిరి పట్టణానికి చెందిన ఆప్కాబ్ ఎండీ రెడ్డివారి శ్రీనాథరెడ్డి తల్లి రెడ్డిసత్యకుమారి ఇటీవల మరణించారు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కలికిరిలోని వారి స్వగృహానికి చేరుకుని శ్రీనాథరెడ్డిని పరామర్శించారు. అలాగే మేడికుర్తి గ్రామం పసలవాండ్లపల్లికి చెందిన ఎల్ఐసీ గిరి తల్లి గజ్జల క్రిష్ణమ్మ బుధవారం మరణించారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పసలవాండ్లపల్లికి చేరుకుని ఆమె మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ ఏవీ రమణ, మహేంద్రరెడ్డి, క్రిష్టారెడ్డి, ద్వారకనాథరెడ్డి, రామిరెడ్డి, బాబురెడ్డి, మునిరెడ్డి, గిరి తదిరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

కేవీపల్లె : మండలంలోని నూతనకాల్వ పంచాయతీ తుమ్మలవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కుప్పం దేవేంద్రరెడ్డి తల్లి కుప్పం సిద్దమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం తుమ్మలవారిపల్లెకు చేరుకుని సిద్దమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, నాయకులు కోర్టు సుబ్బారెడ్డి, చామంచుల సిద్దయ్య, రెడ్డెప్పరెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోని గ్రామ సచివాలయం

– అధికారుల కోసం ప్రజల పడిగాపులు



అమిలేపల్లె, మర్రిమాకుపల్లె గ్రామసచివాలయం ఉదయం 11 గంటల కూడా తెరుచుకోని దృశ్యం

గుర్రంకొండ: మండలంలోని అమిలేపల్లె, మర్రిమాకులపల్లె గ్రామసచివాలయం 11 గంటల సమయం దాటినా తెరవక పోవడంతో ప్రజలు అధికారుల కొసం పడిగాపులు పడ్డారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామ సచివాలయాలు ఉదయం 10 గంటల నుంచి 10.30గంటలలోగా తెరవాల్సి ఉంది. సచివాలయంలో పనిచేసే సిబ్బంది మొత్తం ఆ సమయంలోగా హాజరై ముందుగా బయోమెట్రిక్ ఆతరువాత హాజరు రిజిష్టరులో సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ విధుల నిమిత్తం ఫీల్డ్ విజిట్ వెళ్లాల్సి ఉంటే మూమెంట్ రిజిష్టర్‌లో ఏ పనిమీద వెళుతున్నామో రాసి వెళ్లాల్సి ఉంది. బుధవారం అమిలెపల్లె, మర్రిమాకులపల్లె గ్రామసచివాలయం ఉదయం 11 గంటల వరకు తెరవక పోవడం గమనార్హాం. సచివాలయంలో ఏడు మంది ఉద్యోగులు పనిచేస్తున్నా ఒక్కరు కూడా సచివాలయంకు హాజరు కాలేదు. 11 గంటల తరువాత పంచయతీ కారదర్శి నాగమల్లు గ్రామసచివాలయం తెరిచి ఒక్కేడే కూర్చొన్నాడు. ఇక్కడ పనిచేసే ఒక పంచాయతీ కార్యదర్శి ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఉందని వెళ్లినట్లు పేర్కొన్నారు. మహిళా కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్లు సెలువు పెట్టినట్లు పేర్కొన్నారు. సర్వేయర్, వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు డిప్యూటేషన్ మీద వెళ్లారన్నారు. డిజిటల్ అసిస్టెంట్ పోస్టుఖాళీగా ఉంది. నిబంధనల మేరకు ఏ సమావేశానికి వెళ్లినా ముందుగా గ్రామ సచివాలయంకు సకాలంలో చేరుకొని బయోమెట్రిక్‌తోపాటు హాజరు పట్టికలో సంతకాలు చేయాల్సి ఉంది. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు డిప్యూటేషన్‌పై వెరే గ్రామ సచివాలయల్లో విధులు నిర్వహించాల్సి ఉన్నా ముందుగా ఎక్కడ రెగ్యులర్‌గా పనిచేస్తున్నారో అక్కడ బయోమెట్రిక్‌తో పాటు హాజరుపట్టీలో సంతకాలు చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ ఏ నిబంధనలు పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉదయం 11 గంటల వరకు ఒక్క ఉద్యోగి కూడా బయోమెట్రిక్, హాజరు రిజిష్టర్‌లో సంతకాలు చేసిన దాఖలాలు లేవు. ఈ విషయమై ఎంపీడీవో వెంకటేశులును వివరణ కోరగా ఉదయం 11 గంటల వరకు అమిలేపల్లె, మర్రిమాకులపల్లె గ్రామ సచివాలయం తెరవని విషయం వాస్తవమన్నారు. ఈ సంఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వారందరికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించండి

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్టర్లతో సమావేశమయ్యారు. ఆస్పత్రిలో నెలకొన్న డాక్టర్లు, నర్సులు, సిబ్బంది కొరతపై చర్చించారు. సమస్యను పరిష్కరించేందుకు ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌తో మాట్లాడి డాక్టర్ల నియామకం త్వరలో పూర్తిచేస్తామన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, సౌకర్యాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో మందుల కొరతపై ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రస్తుతం మందుల సరఫరాకు ప్రభుత్వం అందిస్తున్న రూ.11లక్షల నిధులను 30లక్షలకు పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యసేవలపై ప్రజల్లో నమ్మకం కలిగేలా సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ మస్రూర్ అహ్మద్, అసిస్టెంట్ ఆర్ఎంఓ షకూర్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పుసుల్తాన్ మైదానంలో మాల్ నిర్మాణం

పట్టణ అభివృద్ధిలో భాగంగా టిప్పుసుల్తాన్ మైదానంలో షాపింగ్ మాల్ నిర్మాణం చేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. దొంగ డాక్యుమెంట్లు సృష్టించి, భూ ఆక్రమణదారులు వక్ఫ్‌భూములు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. టిప్పుసుల్తాన్ కాంప్లెక్స్ భవనాలను రెగ్యులరైజ్ చేసి మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. మదనపల్లె పట్టణ అభివృద్ధి ధ్యేయంగా రోడ్లు, మౌలికవసతుల కల్పనకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు.

కూలీల సంఖ్య పెంచకుంటే చర్యలు

డ్వామా క్లస్టర్ ఏపీడీ మధుబాబు

పెద్దతిప్పసముద్రం: ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచాలని లేకుంటే చర్యలు తప్పవని డ్వామా క్లస్టర్ ఏపీడీ మధుబాబు హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని క్షేత్ర,సాంకేతిక సహాయకులు, ఈసీ, సీవో, ఏపీవోతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ప్రధానంగా మండలంలోని అన్ని గ్రామాల్లో 578 శ్రమ శక్తి సంఘాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఒక్కో సంఘంలో 20 నుంచి 30 మందిని కూలీలుగా చేర్చాలని ఒక్కో సంఘానికి పర్యవేక్షకుడిగా మేట్ ఉంటాడన్నారు. సంఘాల ఏర్పాటు వేగవంతం చేయాలని అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం కూలీల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంపై ఏపీడీ అసంతృప్తి వ్యక్తం చేశారు.